# గురిజ గింజలు

ఉప్పలయ్య నొగలు పట్టి ఎడ్ల బండిని లావట్టిండు. ఎడ్లు సైర మీదున్నయి. వలుపటి పుల్లది దాపటి పయ్యది కాని కిందికి వచ్చి నిలవడ్డయి.

ఎడ్ల మెడలకు జోళ్ళు కడుతూ "వీళ్ళకు నిండిన్నాడు వద్దంటరు. ఎండిన్నాడు కావాలంటరు. వీళ్ళు ఏడ్సిన్నాడు మేము ఏడ్వాలె. వీళ్ళు నవ్విన్నాడు మేము నవ్వాలె. మా బతుక్కు సంతంగా అవుసరాలు గూడా ఉండయను కుంటరు..." అన్నాడు. అంటూ పగ్గాలు, ముల్లుగట్టె, గొడ్డలి, కొడవలి చేతపట్టుకుని బండి ఎక్కికూసున్నాడు.

క్షణంలో బండీ కదిలేదే. సుంకరి కిట్టడు బజారెంట పోతూ బండికి అడ్డం తిరిగిండు.

"ఏం రా... ఉప్పలి... యాడికిరా బండి? జంగల్‌కు పోతున్నవా ఏంది?" అనుమానంగా అడిగిండు.

ఉప్పలయ్య తల ఎగురేసి కిట్టడిని బిరుసుగా చూసిండు. చూసి ఎడ్లను అదిలిస్తూ "ఔను. జంగల్‌కు పోతున్న. బండెడు పోయిల కట్టెలు నరుక్కత్త..." అన్నడు.

ఉప్పలయ్య మాటలు పూర్తి కానేలేదు. బండి కదిలింది. ఎడ్లను అదిలిస్తూ బండిని ఆపిండు కిట్టడు. 'ఏంరా... తలుకాయుండే మాట్లాడుతున్నవా...? పొద్దున చాటింపు వినలేదా...? ఐదునూర్ల జురుమానా కట్టబుద్ధయితుందా....?" కోపంగా అడిగిండు.

ఎడ్లు రెండు అడుగులు వెనక్కి వేసి కిట్టన్ని చూస్తూ నిలవడ్డయి.

"ఔను. నువ్వెప్పుడత్తవో కట్టగట్టి ఇత్తామని ఐదునూర్లు దాచి పెట్టిన. నాకెవడు...? జురుమానా ఏసేటోడు. బండికి అడ్డంరాకు. ఎడ్లు తొక్కి సంపుతయి" ఎడ్లను అదిలిస్తూ అన్నాడు ఉప్పలయ్య.

బండి నాలుగడుగులు ముందుకు పోయింది. బర్రి కట్టెతో ఎడ్లను అదిలించి మళ్ళీ నిలిపిండు సుంకరి కిట్టడు.

"ఒరే ఉప్పలీ... నేను చెప్పింది విను. జంగల్‌ల కట్టెగొట్టద్దని వనసంరక్షణ సమితి వాళ్ళు నిర్ణయించిండ్రు. కట్టెలు గొడితే జురుమానేత్తరు. లేదంటే కేసు పెడతరు. వాళ్ళకు అధికారముంది. సుంకర్లందరిని కావలి గాయమని చెప్పిండ్రు. ఒక్కబండిని పట్టుకున్న సుంకరికి నూర్రూపాయలిత్తరట. నిన్నరెండు బండ్లను అప్పజెప్పిన. మొన్న మనిషికో రెండు మూడు బండ్లు దొరికినయి. వాళ్ళు రాత్రిపూట దొంగతనంగా అడివికిపోతూ దొరికిండ్రు. నువ్వేమో పట్టపగలే బండిగట్టినవు. మనోడివని చెబుతున్న. ఎవ్వలకు తెలువకముందే బండి ఇడువు" హితబోధ చేస్తున్నట్లుగా అన్నాడు.

ఉప్పలయ్య బండిని అదిలించలేదు కాని కిట్టని వైపు కోపంగా చూసిండు. చేతుల పగ్గాలను మలేసి గుంజి పట్టుకుంటూ "ఒరేయ్ కిట్టా.. ఆకలితో కడుపు మండుతున్నోన్ని. నాకు నీతులు జెప్పకు. నువ్వు ఎవ్వలతోటి చెప్పుకుంటవో చెప్పుకో. నాకు అడ్డమచ్చేటోడు ఎవడో చూస్త" అన్నడు.

ఈ అలికిడికి ఉప్పలయ్య భార్య నీల ఆరేండ్ల కొడుకు బయటికి వచ్చి నిలవడ్డరు. బజారుపొంట పోయే ఇద్దరు ముగ్గురు ఆగి నిలవడ్డరు. చుట్టుపక్కల ఇండ్లనుంచి బయటకచ్చిసూత్తండ్రు.

"వండుకుందామంటె కాటెడు పుల్లలేదు. ఎవలనడిగితే ఎవలిత్తరు. మరి బతుకుదుమా! సత్తుమా! తెలివున్నోళ్ళు ఏ రాత్రో పగలో తెచ్చుకుంటుండ్రు. మనిషి 'సూదండ్రోయ్ సుతారమని' అందరి ముందర బండి గట్టె..." నీల నాలుగడుగుల ముందుకేసి అన్నది.

"ఏం... ఎవని ఇల్లనా దోసుకత్తన్ననా ఏమన్న ఎత్తుకత్తున్ననా? నా ఇష్టమున్నప్పుడు వోయి నా బుద్దున్నప్పుడు కట్టెలు కొట్టుకత్త. రాత్రో పగలో ఎందుకు పోత. జంగల్ ఎవనవ్వ జాగిరి? చెట్లు పెట్టింండ్రా? నీళ్ళు వోసింండ్రా" ఆవేశంగా అంటూ రెండెడ్ల తోకలను అందుకున్నాడు ఉప్పలయ్య.

ఎడ్లు చెంగుమన్నాయి. బండి ముందుకు కదిలింది. ఈసారి సుంకరి కిట్టడు ఆపలేదు. ఉరిమినట్టు చూస్తూ పక్కకు జరిగిండు. జరుగుతూ చుట్టూ చూసి 'ఎంత దూరం పోతవులే... ఊరిపొలిమేర దాటక ముందే ఆపుత' అనుకున్నడు. అనుకున్నట్టు గానే బండికంటే వేగంగా ఊరిలోకి నడిచిండు. బండి అడవి వైపు కదిలింది.

బండి గుడి గడ్డ దాటి వాగులకు దిగిందో లేదో నలుగురు సుంకరోళ్ళు సైకిళ్ళ మీద అడ్డం తిరిగింండ్రు. ఆ వెనకనే స్కూటర్ మీద ముగ్గురు రైతులు దిగింండ్రు. సుంకరోళ్ళను ఎగేసి వాళ్ళకు వినకపోతే తర్వాత మా వంతు అన్నట్టు దూరంగా మౌనంగా నిలబడ్డరు

ముందుగా బండిని గెదుమాలని చూసినా సుంకరోళ్ళ చేతులల్ల కొడవండ్లను చూసి ఆగిపోయిండు ఉప్పలయ్య. 'కొడుకులు ఎడ్లమెడల మీది జోళ్ళను కోసినా కోసేత్తరు అనుకుని 'ఓవ్' అని బండి ఆపుతూ 'ఆ.. ఏంది చెప్పుండ్రి' అన్నాడు.

"చెప్పుడు లేదు గిప్పుడు లేదు. బండి ఎనుకకు మలుపు. చెప్పేటోళ్ళు పంచాది ఆఫీసు కాడున్నరు" తనే బండిని మలుపుతూ అన్నడు సుంకరి కిట్టడు. మళ్ళీ .. "లేసినోడు లెవ్వనోడు అందరు మొనగాల్లే అయింండ్రు. ఒక్కన్ని గట్టిగా తొక్కితే ఇంకోడు సప్పుడు జెయ్యడు. వీనయ్య సంపాయించి పెట్టిండట. బండి గట్టుకుని ఉరుకుతుండు" తనే అన్నడు.

"ఔ... నా అయ్య సంపాయించలేదు. నీ అయ్య గిట్ల సంపాయించినాండ్రా! లావు లావు నీల్గుతున్నవు!" బండిమీదనే లేచిండు ఉప్పలయ్య.

"ముందు బండి నడువని" ఒక సుంకరి అన్నాడు. మరొకడు బండి ఎక్కిండు. పగ్గాలు అందుకోబోతుంటే ఎనక్కితోస్తూ అన్నాడు ఉప్పలయ్య. "నాకు తెలుసురా... మీరు పెంచుకున్న కుక్కలని. బుక్కెడు కూడు కొరకు ఎవలమీదికైనా మొరుగుతరని. పోరా... వాళ్లతోని గాకపోతే వాళ్ళ తాతలతోని మాట్లాడుతా..."

కోపంగా బండిని మలిపి ఊరివైపు గెదిమిండు ఉప్పలయ్య. గెలిచినందుకు సుంకర్లు మీసాలు దిద్దుకున్నరు. సమస్య తమదాకా రానందుకు స్కూటర్ మనుషులు నిరాశగా వెనక్కితిరిగింండ్రు.

ఎడ్లబండి పోతున్నంత దూరం దుమ్ము ఎగిరి పడుతుంది. ఎక్కడ మళ్ళీ ఎనుకకు మలుపుతడో అనుకుని సుంకర్లు సైకిళ్లు పట్టుకుని ఎనుకనే నడుత్తుంద్రు. స్కూటర్ మాత్రం ముందెల్లిపోయింది. వెళ్తూ వెళ్తూ సుంకర్లకు ఏదో చెప్పిపోయింద్రు.

"మేము వచ్చే వరకు జమ గొట్టుంద్రి" కిట్టడు దుమ్ములనే నిలవడి కేకేసిండు.

ఉప్పలయ్య సల్ల పెల్ల మసులుతుండు. పండ్లు బిగపట్టి ఎడ్లను ఉరికిత్తుండు. లోపల లోపల అందరినీ తిడుతుండు. ఊరు జొచ్చినంక తిట్లు గూడా అందుకున్నడు.

"నిండి వాళ్ళున్నరు. ఎండి మేమున్నము. కట్టెలు గొట్టుక రావద్దంటరు. పొయ్యిల ఏంబెట్టి వండుకోవాలె. మోకాళ్ళు బెట్టాలెనా...? వాళ్ళకు సిలిండర్లు, పెండపొయ్యిలాయె. మా పెండ్లాలు గొట్టం వట్టనిది ఎల్లదాయె. ఇట్లంటే ఇదో తప్పు. మా అంతల మమ్ములను బతకనియ్యరు. గెలిగిచ్చి కయ్యం బెడుతరు..."

అప్పటికే ఈ ముచ్చట ఊరంతా ఎలానయింది. ఉప్పలయ్యను, ఎడ్లబండిని కొంతమంది జాలిగా చూస్తే మరికొంత మంది కోపంగా చూస్తుంద్రు. కొంతమంది ఏమైతదోనని ఆసక్తిగా ఎంబడి బోతంద్రు.

"వీళ్లు ఎప్పుడూ అంతే.... ఎప్పుడూ వాళ్లదే సాగాలంటరు. కాలుకెత్తే మెడకేత్తరు. మెడకేత్తే కాలుకేత్తరు. వీనికి కావురంగాకపోతేంది...? కట్టెలు గొట్టద్దని ఊరంతా కట్టయినంక బండిగడుతడా...? మెదబలిమి తనం బాగుంది... ఏమన్నంటే సాలు. కులంతోని తిట్టింద్రని కేసులు పెడుతరు..." ఎనుక ముచ్చట్లు గుసగుసలు.

ఉప్పలయ్య బండిని పంచాది ఆఫీసు ముందు ఆపిండు. అప్పటికే యుద్ధానికి సిద్ధమయినట్టు మంది జమకూడింద్రు. ఏమేం అడుగాల్నో నిర్ణయించుకున్నరు. ఉప్పలయ్య రాకతో శత్రురాజును చుట్టముట్టినట్టుగా చుట్టుకున్నరు.

ఉప్పలయ్య వనుకలేదు. జనుకలేదు. నడిబజార్ల బండి ఇడిసి ఎడ్లను పగ్గాలతో పయ్యలకు కట్టేసిండు. "ఏందిరా... నడిబజార్ల ఇడిత్తివి. పక్కకు ఇడువు. టాక్టర్లత్తయిపోతయి" ఉపసర్పంచ్ అదిలిచ్చిండు.

"తెల్లారనీ పొద్దుగూకని.. పంచాది తెగేదాక బండి అడనే ఉండాలె. టాక్టర్లకు తొవ్వనే లేదా....." వెటకారంగా అన్నడు ఉప్పలయ్య. ఎవరో ఎడ్లను అదిలించబోయారు. అవి కొమ్ములు ఊపుతూ బుస్సుమన్నాయి.

ఉప్పలయ్య లుంగీ సదురుకుంటూ ఆఫీసులకు నడిచిండు. వెంట తెచ్చుకున్న కొడవలి గొడ్డలి ముల్లుగట్టె చేతులనే ఉన్నయి. కుర్సీల మీద సర్పంచ్. వాడ నెంబర్లు, సంఘాల పెద్దలు కూసున్నరు.

"ఏందిరో.. కొడండ్లు, గొడ్డండ్లు తెత్తున్నవు. నరుకుతవా ఏంది...? " జోక్ జేసిండు వాడనెంబరు. అతడి మాటలు వెక్కిరింతగా ఉన్నాయి.

"ఔ....... మా పని అదేనాయె! అట్ల నరికెటోన్నయితే ఇట్ల అడ్డం దిరిగే దమ్ములు మీకుండునా..." విసురుగా అన్నాడు ఉప్పలయ్య. అన్నదమ్ముల గెట్ల పంచాదిల తమ్ముని మీదకి గొడ్డలితో ఉరికిండని నెంబరు మీద నాలుగైదేండ్ల కింద కేసు నడిచింది. ఈ మాటలు నెంబరుకు అక్కడ తగిలినయి. వెంటనే పొడినవ్వు నవ్వుకుంటూ భుజాలు తడుముకున్నడు నెంబరు. మళ్ళా నోరు తెరువలేదు.

నెంబరు నోరు దెరవని మాట అన్నందుకు అందరూ ఉప్పలయ్య వైపు జడుసు కుంటున్నట్టుగా చూసింద్రు. సర్పంచ్ మాత్రం పెద్దరికంగా మాట కదిపిండు.

"అరే.. ఉప్పలయ్యా... ఇది మా మాటగాదురా. గవుర్నమెంటు ఆడరు. చెట్లు గొట్టద్దట. వానలు పడయట. వీలైతే ఒక చెట్టు వెట్టాలెగనీ చెట్టును నరుకద్దంటుంద్రు. నీకు తెలువకగాదు. నువ్వు సదువుకున్నోనివే! మన ఊరికి వివెస్సెస్ కమీటీ గూడా వేసింద్రు. వారం రోజుల నుంచి నువ్వు సూడనే వడితివి. ఎంతమందికి జురుమానవెయ్యలేదు." అన్నడు. మాట్లాడుతున్నంత సేపు అందరు మౌనంగా ఉన్నరని మాటలు పూర్తికాక ముందే ఉప్పలయ్య అడ్డు తగిలిండు.

"ఔ.. పటేలా... మేము కట్టెలు ఎందుకు కొడుతున్నం..?" అడిగిండు. సర్పంచ్ చెప్పలేదు కాని ఎందుకన్నట్టు గంభీరంగా చూసిండు..... ఉప్పలయ్య మధ్యలో నిలవడ్డడు. వాళ్ళు చుట్టూ కుర్చీల మీదకూసున్నరు.

"మేమేం అమ్ముడుకు దెత్తున్నమా... ఇండ్లను గట్టుదుకుదెత్తున్నమా...? పొయ్యిలకు వండుక తినుడుకు దెత్తున్నము..."

"అదే మేము అనేది. ఇట్లనే ఊరందరు అంటరు. ఇంటికి బండెడు దెత్తరనుకో... జంగల్ ఏంగాను" రెడ్డి సంఘం పెద్ద అందుకున్నడు.

"ఏం గాదు. నువ్వు చీకోటి మామిండ్లను బొగ్గు బట్టీకి అమ్మినప్పుడు ఏమైంది...? తాతల నాటి తుమ్మ చెట్లను, చింత చెట్లను కట్టెకోతకు అమ్మిన్నాడు ఏమైంది? అడివినంతా నరికి టేకు చెట్లను దెచ్చి ఐదుగురు కొడుకులకు ఐదు ఇండ్లు గట్టినపు చూడు..? అప్పుడేమైంది..?

ఆ మాటలకు రెడ్డి సంఘం పెద్దకు చిర్రెత్తుకొచ్చింది.

"ఒరేయ్... అవన్నీ నా పట్టా భూములు. నా భూములల్ల నా బుద్దున్న పని చేసుకుంట. అడగుడుకు నువ్వెవలు?" కోపానికచ్చిండు.

ఉప్పలయ్య ఏదో అందామనకున్నంతలోనే వెనుకనుంచి రాజాలు మాటలు వినిపించినయి. "ఔనయ్యా! మీ పట్టా భూములల్ల నరికేటప్పుడు మీకు ఏది యాదికి రాలేదు. చెయ్యాల్సిందంతా చేసింది మీరు. ఇయ్యాల మాపొయిల కట్టెలకు కట్టుబందు జేసిండు. మేము ఇపుడు ఎటుపోవాలె...?"

రాజాలు నిన్ననే జురుమాన గట్టిండు. ఎవలూ చూడరని అర్ధరాత్రి బండి గట్టిండు. ఇల్లు పక్క ఇల్లే సుంకరిది. నిలువు బండిని దొరకవట్టిండు. కట్టెలు సర్పంచ్ కొట్టంల వెట్టిండ్రు. జురుమాన పైసలు కార్యదర్శి దగ్గరున్నయి. నిన్నటి నుంచి అగ్గయి మండుతుండు.

"అందుకే గదా... మీకో మంచి సౌకర్యముంది. దీపం పథకంతో సిలిండరత్తది. పొయ్యి గూడా ఇస్తరు. పొగలేని పొయ్యి. " లేడీ వార్డు నెంబరు అంటుండగనే ఉపసర్పంచ్ అందుకున్నడు.

"మేమేం ముల్లెలు గట్టుకుంటమని మీ దగ్గర జురమాన తీసుకుంటలేము. మీ పైసలు మీకే గ్యాస్ కనెక్షన్ కడుతం. సాంక్షన్ అయినంక ఎంతో కొంత నగతు గట్టి సిలిండర్ తెచ్చుకోవాలె. నిన్న రాజాలు దండుగు గట్టంగనే సర్పంచ్ నేను ఇద్దరం గ్యాస్ కంపెనీకి పోయి రాజాలు పేరు మీద కనెక్షన్ కట్టి వచ్చినం..." అందరివైపు గర్వంగా చూసి అన్నడు.

రాజాలు ఆవేశం చప్పున చల్లారిపోయింది. 'మహానుభావులు. మంచిపని చేసారు' అన్నట్టుగా నిలబడ్డాడు. మరో రెండు మూడు డైలాగులు కొడితే కరిగిపోయి కాళ్ళమీద పడేట్టుగా ఉన్నాడు. ఉపసర్పంచ్ మాటలు కూడా అలాగే ఉంటాయి.

'సమయానికి మంచి పాయింటు చెప్పినవుగ' కళ్ళతోనే మెచ్చుకున్నడు సర్పంచ్.

"మరేం జేసేది. జురుమాన గట్టినోళ్ళంతా ఎనుక నిలవడ్డరు. అంద రొక్కటయితే అపుడు వశంగాదు' ఉపసర్పంచ్ చూపులతోనే చెప్పిండు.

"జొ... పటేలా... మరి మా సంగతేంది. మేము మొన్ననే జురుమాన గడితిమి" మెత్తమెత్తగా అడిగిండు శంకరి.

"అందరికత్తయి. ఒకనాడు టాక్టరు గట్టుకుని పోతే అందరియి తేవచ్చు" కార్యదర్శి అందుకున్నడు.

ముంచుకొత్తున్న ప్రమాదాన్ని ముందుగా గుర్తించింది ఉప్పలయ్యనే. కొడవలి, గొడ్డలిని చేతులు మార్చుకుంటూ "వత్తయి వత్తయి" ముడ్డిపుండ్లకు నూనె లేదుగనీ ఎడ్ల కొట్టంల దీపం బెట్టుమంటరు. నెలనెలకు మూడు వందలు గట్టి గ్యాసు కొనుక్కునే దమ్మంటే మా బతుకులు గిట్లెందుకుండు. అవసరం లేనిదాన్ని అవరంగా తలుగ వెట్టి ఆటలాడాలనుకుంటండ్రు. మాకు ఏ దీపాలొద్దు. మా బతుకు మమ్ములను బతుకనియ్యండ్రి" ఆవేశంగా అన్నాడు.

ఈసారి చౌకిదారు అందుకున్నడు బొంగురు గొంతుతో "అవునా... మాకేమన్న పొయ్యిమంటన్నమా... పెట్టుమంటన్నమా... గవుర్నమెంటు కానూన్ జెప్తుతున్నం. అడువులు గొడితే ఎంత నష్టమో మీకు తెలువది. చెప్పితే ఇనరు. గుడ్డి ముసుర్లు వెట్టి బజార్లల్ల కప్పలు గుడ్లు వెట్టే కాలంల ఎండలు గొట్టి దుమ్ము లేత్తుంది. ఎందుకో తెలుసా...?"

"తెలువది సారూ...... మాకు యాడ తెలుస్తది. కామారెడ్డిల మీ అల్లునికి కట్టెకోత మిషనుంది. కొడుక్కు టింబరు డిపో ఉంది. లారీలకు లారీలు కట్టెలు వత్తయి పోతయి. అక్కడ ఈ సూత్రం అడ్డం రాదా... మేము దెచ్చే బండెడు కట్టెలు మీ డిపోల రంపం పొట్టు విలువగాదు." అన్నాడు ధిక్కరిస్తున్నట్టుగా ఉప్పలయ్య.

"దానికి లైసన్సుంది. కాయిదాలు కథలు ఎన్నుంటయి. దానికి దీనికి పొత్తేంది..?" గాటుగానే అన్నాడు చౌకిదారు.

"లైసెన్సులుంటే వానలు గొడుతయా మరి..." కారడ్డంగా అడిగిండు ఉప్పలయ్య.

వెనుక ఉన్నోళ్ళంతా సప్పవడ్డరని తెలిసిపోతుంది. కావాలనే మాటలతో వాళ్ళకు ఆశను చూపారని గుర్తించిండు. తాను మాత్రం వినేది లేదని మొండి పట్టుదలతో ఉన్నడు.

ఈసారి చౌకీదారుకు ఏం జెప్పాలెనో తెలువలేదు. అందరు కుర్చీలల్ల ఇబ్బందిగా కదిలింద్రు. ఎనుక నిలబడ్డోళ్ళు కొందరు నవ్వింద్రు. జురుమాన గట్టినోళ్ళు 'వీడు మనకు సిలిండర్లు రాకుంట జేత్తండు" అని కోపంగా చూసింద్రు.

ఈసారి కార్యదర్శి అందుకున్నడు. "ఎవలంటే వాళ్ళమీదికి ఉరుకుతున్నవు. పెద్దా చిన్న లేకుంట నోటికచ్చినట్టు మాట్లాడుతున్నవు. అసలు నువ్వు ఏమనుకుంటున్నవు. మేమంతా నీకు పిచ్చోళ్ల లెక్కన కనవడుతున్నామా...?"

కట్టెలతో చుట్టూ మంది నిలబడి నట్ట నడుమున నాగంబాము ఉంటే ఎటు వైపు కట్టెతో తాకితే అటువైపు బుస్సున ఎట్లా లేస్తదో అట్టా లేస్తండు ఉప్పలయ్య.

"కాదు సారు... మేమే మీకు పిచ్చోళ్ళ లెక్క కనవడుతున్నం. అందుకే గదా మా మనుషులతోనే కట్టెలు గొట్టిచ్చి దొంగ కట్టెల యాపారం జేసింద్రు. ఒక్క యాడాదిలనే మీ ఇంట్ల తీరొక్క కట్టె సామాన్లు చేయించుకున్నరు. మీ సుట్టేడు బలుగాలకు చేయించింద్రు. ఈ ముచ్చట కాదంటరా...?"

సర్పంచ్‌కు కోపం వచ్చినట్టుంది విసురుగా అన్నాడు.

"గవన్నీ గాదు. ముందు నీ సంగతి జెప్పు. బండి ఇడుత్తవా...?జురుమాన గడుతవా...?

"నేనా...?" ముల్లు గట్టెను నేలపై పొడుస్తూ అన్నాడు ఉప్పలయ్య... "బండి ఇడువ. జురుమానగట్ట. మీ ఇష్టమున్న పని జేసుకోండి. నేను మాత్రం కట్టెలు తెచ్చుడు తెచ్చుడే. మాపటికి పొయ్యిలకు పుల్లలేదు."

"అంటే... మా ఇష్టమున్న పని జేసుకొమ్మంటవు... ఎనుక శీరి ఏమనవుగద మరి!" అక్కసుగా అడిగిండు సర్పంచ్.

"అనేదేముంది పటేలా. అడవితో మీ అవసరాలు తీరినయి. అందుకని త్రైబందంటున్నరు. అడివికి పోవద్దంటున్నరు. దండుగంటున్నరు. జురుమానంటున్నరు. మీ లెక్కన మాకు ఎల్లుతదా...మా బదుకుడే ఓ సావు. అడుగడుగున సత్తుంటెనే బతుకుతం. ఇగ నువ్వు కొత్తగ జేసేదేముంది. మాంటె కేసు పెడతవు. పోలీసులతో కొట్టిత్తవు. అంటేగదా. అది నెలరోజులు అవస్థ పడ్డా మళ్ళా కోలుకుంట. ఈ కట్టెలు లేకపోతే రెండ్రోజులల్లనే ఆకలి మంటకు సత్తగద."

ఒక్కొక్కమాట ముల్లుతో ముల్లు తీసినట్టయి. ఎవలు నోరెత్తలేదు. ఎత్తుతే యాడ ఏమంటడోనన్న భయం.

"నిన్ను ఎవలు సావుమంటుండ్రురా... మూడు వెయిలిచ్చినా దొరుకని గ్యాస్ కనెక్షన్ సగం ధరకే ఇప్పిస్తమంటున్నం...." ఉపసర్పంచ్ మళ్ళీ అన్నాడు.

"అంటరంటరు. అది మీ బామ్మరిది గోడౌన్ గదా! ఒక్క కనెక్షన్‌కు ఎంత లాభముంటదో తెలువదనుకుంటున్నారా.... ఎట్ల వెట్టు... మీరు మీ కిందికే తోడుకుంటరు. పెద్దమనుషులు గదా! అప్పుడప్పుడు ఇట్లా కొత్త కానూన్‌లు దీత్తరు. వల విసురుతరు. అండ్ల చిక్కుకుని మేము గిలగిల కొట్టుక చస్తం. ఈసారి మీ ఆటలు సాగయి..." వెనుకకు మళ్ళిండు ఉప్పలయ్య ఆవేశంగా.

గ్రామ పంచాది ఆఫీసు కడుప ధాటిండో లేదో నీల ఎదురుంగ వచ్చింది. ఆమె ఎంట సుంకరోళ్ళు నిలబడున్నరు. ఒక్కక్షణం ఆగి "ఏంటిదే... ఎగపోసుకుంట ఉరికత్తున్నవు. నన్ను సంపుతరనుకున్నవా..? పో... పో.. ఇంటి మొఖాన పో.." అంటూ బండి దగ్గరికి నడిచిండు.

నీల అతని వెంటనే నడిచింది. "మనకు కట్టెలద్దు మన్నద్దు. ఊరుతో మనకెందుకు కంటు. నిన్ను ముందుకు నూకిండ్రు. ఎనుకుండి ఎవలన్న ఏమన్న అంటండ్రా... జురుమాన కట్టినోళ్ళు గూడ నీదే తప్పంటండ్రు. మన పొయ్యిల మందం ఏ అయ్యకన్న దయస్తది. ఎవలన్న ఇస్తరు. ఇంటికి నడువు" అన్నది.

ఎనుకకు తిరిగి నీలను ఇరుగ జూసిండు ఉప్పలయ్య. ఆఫీసు నుంచి అప్పుడే పెద్దలంత బయటకచ్చిండ్రు. అదంతా తమకు తెలుసన్నట్టు చూసి చూడనట్టుగనే దాటిపోతండ్రు. పోతూ పోతూ సుంకరోళ్ళ దిక్కు చూసి ముసి ముసి నవ్వుకుంట పోతండ్రు. సుంకరోళ్ళు గూడా గుంభనంగా నవ్వుతూ నీలను ఉప్పలయ్యను చూస్తండ్రు.

చుట్టూ గుమిగూడిన జనం తలా ఒకటి మాట్లాడుతున్నరు. కొందరు ఉప్పలయ్యను మెచ్చుకుంటే కొందరు ఇంత కావురమా అని దుయ్యపడుతుండ్రు. ఇదేమీ పట్టించుకోని ఉప్పలయ్య బండి ఎత్తికట్టిండు. నీల ఎక్కి కూసుంది.

ఇంటిముందుకు పోయినంక బండిని ఆపింది నీల.

"సుంకరోళ్ళు జెప్పింద్రు. మనను చూసి ఊరంతా బండిగడుతరట. అట్లా ఊరు అదుపు దప్పి పోతదట. చీకటి పడినంక ఎవలకూ తెలువకుంట జంగల్‌కుపోయి ఒకటిగాదు రెండు బండ్లు తెచ్చుకొమ్మన్నరు. మనకు కట్టెలు ముఖ్యం. అంతేగదా!" సముదాయించింది.

ఉప్పలయ్య వినలేదు.

నీలగూడ వినలేదు. అడుగు ముందుకు కదులనియ్యలేదు. ఏడ్చింది. మొత్తుకుంది. ఉప్పలయ్య బండి ఇడువక తప్పలేదు.

అర్ధరాత్రి పూట నీలనే లేపింది ఉప్పలయ్యను. బండి బయిలెల్లింది.

● ఆదివారం, ప్రజాశక్తి - 19 అక్టోబర్, 2003 ●